ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా మోత్కూరు వాసి ప్రీతం

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

మోత్కూరు, మార్చి17 : మోత్కూరు పట్టణానికి చెందిన నగరిగారి ప్రీతం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. మార్చి 23, 1985న బాబురావు, వసంత దంపతులకు ప్రీతం జన్మించారు. సెక్రెట్ హార్ట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, జవహర్‌లాల్ నెహ్రూ కళాశాలలో ఆయన పాలిటెక్నిక్ పూర్తి చేశారు. జేఎన్టీయూ కూకట్‌పల్లిలో ఎంబీఏ చదువుతూ 2002లో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రజల అభ్యున్నతి కోసం పని చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ కులాల చైర్మన్‌గా సేవలందిస్తున్న ప్రీతమ్‌ను కాంగ్రెస్ సర్కారు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం చేసింది. ఈ మేరకు స్థానిక మున్సిపల్ చైరపర్సన్ గుర్రం కవిత, కాంగ్రెస్ మండల, పట్టణ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రీతమ్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- జిల్లాలో 109 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 19,302 మంది విద్యార్థులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్.. సీసీ కెమెరాల ఏర్పాటు
- ఈ సారి ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్

నల్లగొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

రామగిరి, మార్చి 17 : పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు టెన్త్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఎగ్జామ్స్ జరుగనున్నాయి. మొదటి రోజు కంపోజిట్ తెలుగు ఉన్న విద్యార్థులకు మాత్రం ఉదయం 9.30 నుంచి 12.50 గంటల వరకు, భౌతికశాస్త్రం లేదా జీవ శాస్త్రం పరీక్షలు వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు నిర్వహించనున్నారు. పది పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 19,302 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 109 సెంటర్లు ఏర్పాటు చేశారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. అదే విధంగా ఎగ్జామ్ సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయనున్నారు. పరీక్ష కేంద్రంలో సిబ్బందిని తప్ప ఇతరులను ఎవరినీ అనుమతించరు. పరీక్షల నిర్వాహకులు సహ ఎవరికీ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికాలు అనుమతించడం లేదు. పరీక్ష నిర్వహణలో భాగంగా ఎలాంటి ఫిర్యాదులున్నా డీఈఓ ఆఫీసులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

పరీక్షల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ పలు సూచనలు చేసింది. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే అంటే 8.30 గంటలకే చేరుకోవాలి. 8.50 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. విద్యార్థులు పరీక్షలకు ఒక రోజు ముందుగానే కేంద్రాన్ని చూసుకోవాలి. స్టూడెంట్స్ పరీక్ష కేంద్రంలోని నిర్ణీత సమయం 9.30గంటల తర్వాత ఐదు నిమిషాలు అంటే 9.35గంటకు వరకు అనుమతిస్తారు. ఈ సారి కొత్తగా ఐదు నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఇచ్చారు. తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. విద్యార్థులు పాఠశాల యూనిఫామ్స్‌ను ధరించొద్దు. సివిల్ డ్రెస్‌లో మాత్రమే రావాలి. పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగినా అందుకు కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, పరీక్షల సమయంలో భాగస్వాములయ్యే వారంతా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ సూచించారు.

వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

జగన్మోహిని అలంకారంలో లక్ష్మీనరసింహ స్వామి
అశ్వవాహనంపై ఊరేగింపు

నేడు రాత్రి కల్యాణ వేడుక..
ఉత్తర మాఢ వీధుల్లో ఏర్పాట్లు పూర్తి

యాదగిరిగుట్ట ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి విశేష ఘట్టం ఎదుర్కోలు వేడుక కనులపండువగా జరిగింది. ముక్కోటి దేవతల సాక్షిగా ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదురుగా తిరుమాఢ వీధుల్లో కార్యక్రమాన్ని వేద మంత్రాలతో నిర్వహించారు. భక్తజనుల జయజయ ధ్వనులు, అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆశ్వవాహనంపై నరసింహ స్వామిని ప్రధానాలయ కల్యాణ మండపం నుంచి ఉత్సవ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామి వారి విగ్రహాన్ని తూర్పునకు అభిముఖంగా, అమ్మవారి విగ్రహానిన పశ్చిమ దిశకు అభిముఖంగా ఎదురెదురుగా ప్రతిష్ఠించారు. ఇరువైపులా అధికారులు, అర్చకులు, రుత్వికులు ఆసీనులై పెండ్లి పెద్దలుగా వ్యవహరించారు. రెండు జట్లుగా ఎదుర్కోలు తంతును నిర్వహించారు. అర్చక బృందం అమ్మవారి అంద చందాలు, సుగుణాలు కీర్తించారు. అమ్మవారి వైపున యాదగిరిగుట్టకు చెందిన సంస్కృత విద్యాపీఠం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ధరూరిరామానూజాచార్యులు పాల్గొన్నారు. అమ్మలేనిది స్వామి లేడు. స్వామిని లోకానికి పరిచయం చేసింది అమ్మవారే అనే అంశాన్ని ఉదాహరణలతో వివరించారు. యాదగిరిగుట్టలో స్వయంభూ లక్ష్మీనారసింహ స్వామిగానే భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడన్నారు. పంచనారసింహుడి క్షేత్రంలో స్వామి అపూర్వమైన అనుగ్రహం లోకాలకు అందిపజేస్తున్నది అమ్మవారేనని తెలిపారు. స్వయంభూ అంటేనే అమ్మవారని అన్నారు. స్వామి వారి కల్యాణం అమ్మవారితో సోమవారం రాత్రి జరిపేందుకు సుముహూర్తం నిశ్చయించారు.

పరమార్థ తత్వమే ఎదుర్కోలు

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన వేడుక ఎదుర్కోలు ఉత్సవమని, జీవ, పరమాత్మకు ఇద్దరికి నిర్వహింపబడే నిత్య సమ్మేళన రూపమైన పరమార్థ తత్వమే ఈ ఎదుర్కోలు అని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు తెలిపారు. స్వామివారు ఆశ్వవాహనరూఢుడై భక్తులను అనుగ్రహించుట ఎంతో ప్రశస్తమైయున్నదని చెప్పారు.

స్వామివారికి టీటీడీ పట్టువస్త్రాలు

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సంప్రదాయంగా మేల్చాట్ పట్టు వస్త్రాలను సమర్పించారు. తిరుపతి దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారి లోకనాతం, పర్యవేక్షకులు సురేశ్, అర్చకులు, అధికారులతో కలిసి ఆదివారం యాదగిరిగుట్టకు చేరుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం జగన్మోహిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారిని దర్శించుకొని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావుకు పట్టువస్త్రాలను అందజేశారు.

ముగ్ధమనోహరంగా జగన్మోహిని అలంకారం

ఎదుర్కోలు మహోత్సవంలో భాగంగా స్వామివారిని ఆదివారం జగన్మోహిని అలంకారంలో, పెండ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. జగన్మోహినీ అలంకార సేవను ప్రధానాలయ తిరుమాఢ వీధుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలు, ముత్యాల ఆభరణాలు, వివిధ పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. మూలమంత్ర జపాలు, స్తోత్రాలు, మంత్రోచ్చరణ, ఆళ్వారు దివ్య ప్రబంధ ప్రాశురాలను పఠిస్తూ మంగళవాయిద్యాల నడుమ భక్తులు గోవిందా.. గోవిందా అంటూ పాల్గొన్నారు. ఎడమచేతిలో అమృత కలశం, కుడిచేతిలో తన జడను తిప్పుతూ అద్భుత భంగిమలో స్వామివారు దర్శమివ్వగా భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు. పరమాత్మ అద్భుత సౌందర్య స్వరూపమే జగన్మోహిని అని శ్రీమాన్ అమరవాధి వేంకట నరసింహాచార్యులు అలంకార విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రమేశ్‌బాబు, రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, రాంమోహన్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, రాజన్‌బాబు పాల్గొన్నారు.

అలరిస్తున్న ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందుగా కొనసాగుతున్నాయి. మల్లాపురం గ్రామానికి చెందిన శ్రీరామభక్త భజన మండలి, కార్యాన్‌కు చెందిన శ్రీవిశ్వాంజనేయ భక్త సమాజం, యాదగిరిగుట్టకు చెందిన శ్రీయాదాద్రి భక్తజన సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, శ్రీమాన్ అమరవాధి వేంకట నరసింహాచార్యులు గారిచే సుదర్శన నారసింహ హోమం, నృసింహ ఆవిర్భావంపై ఉపన్యాసం నిర్వహించారు. చేబ్రోల్ నారాయణ దాస్, భాగవతార్ వారిచే భీష్మ ప్రతిజ్ఞ హరికథాగానం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం కరీంనగర్‌కు చెందిన ఎ. తిరుమల వారితో భక్తిసంగీత కార్యక్రమం, దిస్కూల్ ఆఫ్ క్లాసికల్ డాన్స్ అకాడమి ఆధ్వర్యంలో భరతనాట్యం, డాక్టర్ వనజా ఉదయ్‌తో కూచిపూడి నృత్యప్రదర్శన, జొన్నలగడ్డ సత్య శ్రీరాం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కార్యక్రమం నిర్వహించారు.

నేడు తిరుకల్యాణ మహోత్సవం

స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ప్రధానాలయ పునః ప్రారంభానంతరం రెండోసారిగా జరిగే వేడుకకు ఉత్తర మాఢవీధుల్లో వాయుదిశలోని లిఫ్టు, రథశాల ప్రాంతంలో మూడు పంచతల రాజగోపురాలతో మహాద్భుతంగా కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ వేదిక ముందుభాగంలో 3,500 మందికి కూర్చునే విధంగా వసతులు కల్పించారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చనున్నారు.

350 మంది పోలీసులతో బందోబస్తు..

తిరు కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. రాచకొండ కమిషనరేట్ నేతృత్వంలో ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అడిషినల్ డీసీపీలు, నలుగురు ఏసీపీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్‌లతోపాటు ఇతర మహిళా పోలీసులు, అధికారులు పాల్గొననున్నారు. మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా కల్యాణోత్సవంలో పాల్గొననున్నట్లు సమాచారం.

ఉచిత వైద్య శిబిరం

యాదగిరి కొండపైన హైదరాబాద్ కొత్తపేటకు చెందిన శ్రీసాయి సంజీవని ప్రైవేట్ ఆసుపత్రి, కొండకింద కొత్త బస్టాండ్, కల్యాణకట్ట వద్ద యాదగిరిగుట్ట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.

జగన్మోహిని అలంకార సేవలో స్వామి వారి సేవ

సిద్ధమవుతున్న కల్యాణవేదిక

కళాకారుల నృత్య ప్రదర్శన

ఎన్నికల నియమావళిని పాటించాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, చిత్రంలో ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ రూరల్, మార్చి 17 : కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో శనివారం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని, విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలని కలెక్టర్ దాసరి హరిందన ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె ఎన్నికల షెడ్యూల్‌ను తెలియజేస్తూ ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. ఏప్రిల్ 25న నామినేషన్ దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉప సంహరణ, మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 1,766 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 46 ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. 30 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, 30 మహిళా పోలింగ్ కేంద్రాలు , 6 యూత్ పోలింగ్ కేంద్రాలు, మరో 6 సీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 14.9 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 7.36 లక్షలు పురుషులు, 7.54 లక్షలు మహిళా ఓటర్లు ఉన్నారని, కొత్తగా 52,000 మంది ఓటర్లు నమోదయ్యారని వివరించారు. ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని, ముందస్తు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని సూచించారు. ఎన్నికల సందర్భంగా సీసీ కెమెరాలు పెంచామని, ఎవరు ఎవరినీ మోసం చేయొద్దని, ఒక వేళ అలాంటివి తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్ఓ రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, సమాచార శాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు, మీడియా రిలేషన్స్ నోడల్ అధికారి, ఇండస్ట్రీస్ జీఎం కోటేశ్వర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

- భువనగిరి పార్లమెంట్ పరిధిలో 18,00,398 మంది ఓటర్లు
- 2,141పోలింగ్ కేంద్రాలు
- అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి
- నిబంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు
- కలెక్టర్, ఆర్ఓ హనుమంతు కె. జెండగే
- 23 చెక్ పోస్టులతో అక్రమాలపై నిఘా
- రూ. 50వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దు : డీసీపీ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

యాదాద్రి భువనగిరి, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహిస్తామని, ఇందుకు అన్ని పార్టీలు సహకరించాలని కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హనుమంతు కె. జెండగే కోరారు. ఎలక్షన్స్ కోసం ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అడిషనల్ కలెక్టర్లు గంగాధర్, బెన్ షాలోమ్, ఆర్డీఓ అమరేందర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు మొత్తం 18,00,398 ఓటర్లు ఉన్నారని, అందులో 8,94,789మంది పురుషులు, 9,05,531 మంది మహిళలు ఉన్నారని వివరించారు. ఇబ్రహీంపట్నంలో 3,37,389 ఓటర్లు, మునుగోడులో 2,56,269, భువనగిరిలో 2,19,688, నకిరేకల్‌లో 2,52,906, తుంగతుర్తిలో 2,58,447, ఆలేరులో 2,34,262, జనగాంలో 2,41,437 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. నామినేషన్ ముందురోజు వరకు కూడా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగిందని, పార్లమెంట్‌లోనూ అత్యధికంగా నమోదయ్యేలా సహకరించాలన్నారు.

2,141పోలింగ్ కేంద్రాలు

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు 2,141పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ అన్నారు. ఓటరుకు రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. పార్లమెంట్ పరిధిలో 23ఫ్లయింగ్ స్క్వాడ్లు, 23 స్టాటిస్టికల్ సర్వేయల్ టీమ్‌లు, 9 వీడియో వీవింగ్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తాయని తెలిపారు. ఓటర్లకు ఏమైనా సమస్యలు ఉంటే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని, వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా 1950 నంబర్‌కు కాల్ చేయొచ్చని వివరించారు. ఎన్నికల నియమావళికి సంబంధించి ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నియమావళి దృష్టిలో ఉంచుకుని జూన్ ఆరో తేదీ వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని కలెక్టర్ అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు సువిధ పోర్టల్ ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సమావేశాలు నిర్వహించుకునేలా అనుమతిస్తామని తెలిపారు. ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24గంటల వ్యవధిలో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పెట్రోల్ బంక్‌లు తదితర ప్రాంతాల్లో 48గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72గంటల వ్యవధిలో పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం ఉన్నందున ఎవరూ నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనంతరం రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు.

రూ. 50వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దు : డీసీపీ

డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్ర మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే ప్రతి ఒక్కరికీ నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఎన్నికల ప్రక్రియకు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి తొమ్మిది చెక్ పోస్టుల ద్వారా పూర్తి నిఘా ఉంటుందని వివరించారు. పార్లమెంట్ పరిధిలో 23 చెక్ పోస్టులు ఉంటాయన్నారు. బంగారం, నగదు, మద్యం అక్రమ రవాణా జరుగకుండా, అలాగే గంజాయి, మత్తు పదార్థాల రవాణా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా రూ. 50వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ఒక వేళ తరలిస్తే ఆధారాలను వెంటబెట్టుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తనిఖీల్లో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామన్నారు. ఆధారాలు సమర్పిస్తే గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. తనిఖీల నిర్వహణలో ప్రతి పనిని వీడియోగ్రఫీ చేస్తామన్నారు.

టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేశ్‌రెడ్డి

- ఎట్టకేలకు లభించిన పదవి
- పార్టీ గ్రూపుల మధ్య సయోధ్య కుదిరేనా?

సూర్యాపేటలో పటేల్ రమేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

సూర్యాపేట, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : సుదీర్ఘ నిరీక్షణ అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పటేల్ రమేశ్‌రెడ్డికి పదవి వచ్చింది. టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సూర్యాపేటలో రమేశ్‌రెడ్డి నివాసం వద్దకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని సంబురాలు చేసుకున్నారు. బొకేలు, శాలువాలు అందించి రమేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు చెప్పారు. రమేశ్‌రెడ్డి రెండు సార్లు సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించినా దక్కకపోగా పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ కచ్చితమైన హామీ ఇచ్చినప్పటికీ చివరలో మరొకరికి కేటాయించారు. దాంతో అసంతృప్తిగా ఉన్న రమేశ్‌రెడ్డికి కార్పొరేషన్ పదవి ఇవ్వడంతో ఆయనతోపాటు అనుచరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంతోపాటు జిల్లాలో చాలా టూరిజం ప్రదేశాలు ఉన్నాయని, ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తీసుకురావడంతోపాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటకంగా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ పదవి తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు భరోసా, ధైర్యం ఇస్తుందని, అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటానని తెలిపారు. ఇదిలా ఉంటే సూర్యాపేటలో గత దశాబ్దకాలంలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి రెండు వర్గాలుగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించిన విషయం విదితమే. రెండు సార్లు సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి దామోదర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి ఒకరంటే మరొకరు కారణమనే భావనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న దామోదర్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని తన చుట్టూ తిప్పుకుంటుండగా, రమేశ్‌రెడ్డికి ప్రొటోకాల్ ఉండే పదవి రావడంతో ఆయనను అధికారులు కచ్చితంగా కలువాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల మార్కెట్ కమిటీ వేసేందుకు జాబితా సిద్ధం చేయగా నల్లగొండ మార్కెట్ కమిటీకి జీఓ వచ్చినప్పటికీ సూర్యాపేటలో రాకపోవడం పట్ల రెండు వర్గాలుగా ఉండడమే కారణమని తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో సూర్యాపేటలో ప్రొటోకాల్, నాన్ ప్రొటోకాల్ రెండు గ్రూపుల మధ్య సఖ్యత ఉండేనో లేక ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తారో వేచి చూడాల్సిందే.